క్లుప్తంగా

ఎస్‌బీఐ ఆర్‌ఎంగా తపోధన్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ (కాకినాడ)గా తపోధన్ నియమితులయ్యారు. విశాఖ నుంచి ఆయన బదిలీపై కాకినాడ ఆర్‌ఎంగా వచ్చారు. ఇప్పటి వరకూ పనిచేసిన జయంతి నర సింహ మూర్తి డీజీఎంగా పదోన్నతిపై వెళ్లారు.

పద్యపఠనంపై నేడు శిక్షణ తరగతులు

కాకినాడ కల్చరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని శాస్త్రి కళా ప్రాంగణం సమావేశ మందిరంలో సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల ప్రోత్సాహ వేదిక ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు «పద్యం రస నైవేద్యం» పేరుతో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు వేదిక అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్ తెలిపారు. పద్యం రాగయుక్తంగా ఆలపించడంలో శిక్షణ ఇస్తామని తెలిపారు. సాహితీ ప్రియులందరూ శిక్షణ పొందవచ్చునని తెలిపారు.

అన్నదాన సమాజానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సినిమారోడ్డులోని కోకనాడ అన్నదాన సమాజానికి సత్యసూర్య కుమారి (కాకినాడ) బుధవారం రూ. లక్ష విరాళాన్ని అన్నదాన సమాజం చైర్మన్ ముమ్మిడి శ్రీనివాసరావుకు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కరప: కరప సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలు కాగా కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. కరప పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బిక్కవోలు మండలం మెల్లూరు గ్రామానికి చెందిన దాసనపల్లి దుర్గాప్రసాద్ హైదరాబాద్‌లో ప్రైవేటు సంస్థలో పనిచేస్తుంటాడు. దుర్గాప్రసాద్ రెండురోజుల క్రితం స్వగ్రామం మెల్లూరి వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం మోటార్‌సైకిల్‌పై కాకినాడ వెళ్లి తిరిగి వస్తుండగా కరప సమీపంలోని బ్రాందిషాపు వద్దకు వెళ్లేసరికి కాకినాడ వైపు నుంచి ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్‌కు తలపైన, తొడపైన తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం అతనిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఏఎస్‌ఐ వి.సూరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలపై సీఐకి వినతి

కాకినాడ రూరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పిలుపు మేరకు కాకినాడ రూరల్ నియోజవర్గంలోని సమస్యలతో కూడిన అభియోగ పత్రం(చార్జ్‌షీట్)ను ఆ పార్టీ నేతలు బుధవారం సాయంత్రం కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్‌కు అందించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేటుకూరి సూర్యానారాయణరాజు, జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు.

వన్‌స్టాప్ సెంటర్ పరిశీలన



ఎస్పీ సతీష్‌కుమార్‌కు దిశ వన్‌స్టాప్ సెంటర్ కార్యకలాపాలు వివరిస్తున్న అడ్మిన్ శైలజ

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లోని దిశ వన్‌స్టాప్ సెంటర్‌ను ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం సందర్శించారు. నమోదవుతున్న కేసులు, బాధితులకు అందుతున్న సేవలను సెంటర్ అడ్మిన్ ఆర్.శైలజ ఎస్పీకి వివరించారు. వాహన సౌకర్యం కోసం శైలజ విన్నవించగా దిశ వాహనాన్ని కేటాయిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. పోలీస్ శాఖ నుంచి అన్ని వేళల్లోనూ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆయన అన్నారు. ఎస్పీ పీడీ ప్రవీణ, దిశ వన్‌స్టాప్ బృందంతో కలిసి నూతనంగా నిర్మితమవుతున్న దిశ వన్‌స్టాప్ భవంతిని పరిశీలించారు. ఎస్పీ వెంట దిశ డీఎస్పీ మెహర్ జయరాం ప్రసాద్, ఎస్సై రాజ్యలక్ష్మి, ఏఎస్‌ఐ చంద్ర, పారా లీగల్ పర్సనల్ పి.నాగలక్ష్మి, కేస్ వర్కర్ లక్ష్మీ దేవి, ఐటీ స్టాఫ్ దుర్గాదేవి, పారామెడికల్ పర్సనల్ అచ్యుత కుమారి ఉన్నారు.

పట్టుకు ప్రోత్సాహకాలు ఇప్పించండి

పిఠాపురం: పట్టు గూళ్లకు ఇచ్చే ప్రోత్సాహక బకాయిలు వెంటనే విడుదల చేయించాలని గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన పట్టు రైతులు బుధవారం పిఠాపురంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టు రైతులు మాట్లాడుతూ 2021–22వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ చేబ్రోలు సెక్టారులో రైతులకు రూ.2 కోట్ల వరకూ బకాయిలు ఉన్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలు ప్రస్తుత ప్రభుత్వం రాగానే ఇప్పించారని, అలాగే ఈ బకాయిలు అందించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, పలువురు పట్టు రైతులు పాల్గొన్నారు.

తేడావస్తే డ్రైయిన్‌లోకే..!

- ప్రమాదభరితంగా ఏటిగట్టు రోడ్డు వంతెన
- రెయిలింగ్ ధ్వంసమై శిధిలావస్థకు..
- ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు



రెయిలింగ్ ధ్వంసమైన శహపురం డ్రెయిన్‌పై ఉన్న వంతెన

కరప: శహపురం డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. ఇరుకైన వంతెన, రెయిలింగ్ ధ్వంసం కావడంతో దీనిపై ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. దీనిని పునర్నిర్మించాలన్న డిమాండ్లు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. కరప, పెదపూడి మండలాల పరిధిలోని ఆరు గ్రామాల్లోని పంట పొలాల్లోని మురుగునీరు, ముంపునీరు ఈ డ్రెయిన్ ద్వారా ప్రవహించి గొర్రిపూడి వద్ద తుల్యభాగ డ్రెయిన్‌లో కలుస్తాయి. ఈ ప్రాంతంలోనే శిధిలమైన వంతెన ఉంది. గొర్రిపూడి, వేములవాడ గ్రామాల మధ్య ఏటిగట్టు వెంబడి ఉండే రోడ్డు మార్గం ఈ వంతెన మీదుగా సాగుతుంది. కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాలను ఈ వంతెన అనుసంధానం చేస్తుంది. మండలంలోని వేములవాడ, వలసపాకల, వాకాడ, కరప తదితర గ్రామాల వారు కాజులూరు మండలం వైపు, అటు కోటిపల్లి, ద్రాక్షారామ వెళ్లాలనుకునే మండలవాసులు తాళ్లరేవు రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలన్నా ఈ వంతెన మీదుగానే ప్రయాణించాలి. మండలంలోని గొర్రిపూడి, కొంగోడు, విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు తదితర గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన కరప రావాలంటే ఇదే దగ్గరమార్గం. వేములవాడ ఏటిగట్టురోడ్డు ఇటీవల ఆధునీకరించినా, ఈ వంతెనను మాత్రం పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

వంతెనను పునర్నిర్మించాలి



చాలాకాలం క్రితం నిర్మించిన శహపురం డ్రెయిన్‌పై ఉన్న వంతెన ప్రస్తుతం శిధిలమైంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. సత్వరం ఈ వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– ఊబా కిశోర్, గొర్రిపూడి

రైతులు ఇబ్బంది పడుతున్నారు



వంతెన రెయిలింగ్ ధ్వంసమవ్వడంతో పంట ఉత్పత్తులు తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నాం. రెండెడ్ల బళ్లు వెళ్లేందుకు వీలులేక పంట ఉత్పత్తులు తెచ్చుకునేందుకు, అదనంగా వ్యయం చేయాల్సివస్తోంది. అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– అప్పనపల్లి పెద్ద, వేములవాడ

చలివేంద్రం ప్రారంభం

బోట్‌క్లబ్: స్థానిక గ్లాస్‌హౌస్ సెంటర్‌లో బీజేపీ సౌత్ మండల అధ్యక్షుడు చెక్కా రమేష్ ఆధ్వర్యంలో పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గట్టి సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. పార్టీ నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య పాల్గొన్నారు.

పొలంబడితో ఆధునిక పద్ధతులపై అవగాహన

కరప: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు వివరించి, రైతులను నిష్ణాతులుగా తయారు చేయడానికే పొలంబడి నిర్వహిస్తున్నట్టు కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు తెలిపారు. కొంగోడు రైతు భరోసా కేంద్రంలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి క్షేత్ర దినోత్సవాన్ని జరిపి అనంతరం ఆయన మాట్లాడారు. వ్యవసాయశాఖ సూచనలు పాటిస్తే తక్కువ పెట్టుబడులతో, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వేసవిలో రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకుని, సిఫార్సుల మేరకు భూమిని సారవంతం చేసుకోవాలన్నారు. పొలంబడిలో ఆచరించాల్సిన ప్రాథమిక సూత్రాలను వివరించి, రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ సలహాసంఘం అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు, డీఆర్‌సీ ఏడీఏ కె.మాధవి, ఎంఏఓ ఏవీ రాజేష్ పాల్గొన్నారు.

పేదలకు సొంత ఇళ్లే లక్ష్యం



లే అవుట్లను సందర్శించిన ఎమ్మెల్యే ద్వారంపూడి, కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ తదితరులు

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా ఇల్లు లేని ప్రతి పేదవానికి సొంతింటి కలను ప్రభుత్వం నిజం చేస్తుందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం జగన్నాథపురం 14 నుంచి 26 డివిజన్లకు సంబంధించి గృహ నిర్మాణ లబ్ధిదారులకు కేటాయించిన వివిధ లేవుట్లను ఎమ్మెల్యే ద్వారంపూడి, కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్, వివిధ శాఖల అధికారులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండో విడతలో మంజూరై గృహ నిర్మాణానికి ఆసక్తి చూపిస్తున్న లబ్ధిదారులకు చొల్లంగి, పటవల గ్రామాల్లో సుమారు 150 ఎకరాలలో పదివేల ప్లాట్లను సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే లబ్ధిదారులకు స్థలాలను అప్పగిస్తామన్నారు. కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ లే అవుట్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రత్యేక దృష్టి సారిస్తామని ఇక్కడ ఇంటి నిర్మాణం చేపట్టే ప్రతి లబ్ధిదారుడికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రహదారులు, నీటి వసతి, విద్యుత్ సౌకర్యంతో పాటు ప్రధాన రహదారులతో అనుసంధానం ద్వారా రవాణా సౌకర్యాలను మెరుగు పరుస్తామని చెప్పారు. ఏడీసీ సిహెచ్ నాగ నరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, హౌసింగ్ ఈఈ గుప్తా, ఏసీపీ నాగశాస్త్రులు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రపాలేన్ని ఉత్తమంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- వలంటీర్లు, సిబ్బందితో సమావేశం



వలంటీర్లు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ఇంద్రపాలెం గ్రామాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. గ్రామంలోని సచివాలం–1లో సిబ్బంది, వలంటీర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామ నాయకుడు, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే కన్నబాబు అడిగి తెలుసుకున్నారు. జెడ్ బ్రిడ్జి అభివృద్ధి, గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి వెడల్పు, గ్రామంలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ఎదురవుతున్న న్యాయ పరమైన చిక్కులతోపాటు ప్రధానంగా పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల పొజిషన్ చూపించడం వంటి వాటిని గ్రామ నాయకులు, వలంటీర్లు, తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కాకినాడ నగరానికి ఆనుకుని ఉన్న ఇంద్రపాలెంలో వేలాదిగా ప్రజలు నివసిస్తున్నారన్నారు. నగరానికి దీటుగా దీనిని తీర్చిదిద్దుతామన్నారు. సీఎం జగన్ పేదల కోసం యజ్ఞంలా ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నారన్నారు. ఇంద్రపాలెం గ్రామస్తులకు నేమాం–3, నేమాం–4 లే అవుట్, పండూరు, తిమ్మాపురం గ్రామాలలో అన్ని వసతులతో ఏర్పాటు చేసిన లే అవుట్లలో పట్టాలు ఇచ్చామన్నారు. పట్టాలు పొందిన వారికి వారం రోజుల్లో పొజిషన్ చూపాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. లే అవుట్లలో రాళ్లపై నంబరింగ్ చెరిగిపోవడం వలన జాప్యం జరిగిందని, సరి చేశామని వారం రోజుల్లో అప్పగిస్తామని డీఎల్‌డీఓ నారాయణమూర్తి పేర్కొన్నారు. గ్రామంలో రహదారి విస్తరణ పాటు అభివృద్ధి పనులకు అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనరు గీసాల శ్రీనివాస్, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కరప: మండలంలోని పలుగ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పర్యటించి ఇటీవల మృతి చెందినవారి కుటుంబసభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. అరట్లకట్టలో సానా ఆదిలక్ష్మి, జెడ్.భావారంలో వాసంశెట్టి సత్తెమ్మ (కరుణమ్మ), గొడ్డటిపాలెంలో వీరంరెడ్డి చంద్రకళ, కొరిపల్లిలో తిబిరిశెట్టి పట్టాభిరామయ్య, పెనుగుదురులో పెచ్చెట్టి రమేష్, షేక్ సుల్తాన్‌సాహెబ్‌లు మృతి చెందగా ఆయా కుటుంబసభ్యులను ఎమ్మెల్యే కన్నబాబు పరామర్శించి, సంతాపం వ్యక్తంచేశారు. మండల పార్టీ యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, అరట్లకట్ట, గొడ్డటిపాలెం, కొరిపల్లి సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రమణి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): దేశ రాజధాని ఢిల్లీలో సాగుతున్న రెజ్లర్ల అందోళనకు మద్దతుగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్ రమణి అధ్యక్షత వహించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు కేఎంఆర్ ప్రసాద్ మాట్లాడుతూ లైంగిక వేదింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్, ఎంపి బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.శేష బాబ్జీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.రాజా, ఆర్పీఐ నాయకులు ఏ.రామేశ్వరరావు తదితరులు మాట్లాడారు. 18వ తేదీన గ్రామ వార్డు ప్రాంతాల్లోను, 20న జిల్లా కేంద్రంలో ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. ఎం.కృష్ణమూర్తి, వి.చంద్రరావు, వి.రవికుమార్, కృష్ణశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వప్న

కరప: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టి, నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించేలా కృషిచేయాలని ఎంపీడీఓ కర్రె స్వప్న అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, సిబ్బందిదో ఆయన సమావేశమై పలు సూచనలిచ్చారు. ఉపాధి కూలీలకు రోజువారీ వేతనం రూ.279 వచ్చేలా కొలతలపై అవగాహన కల్పించి, పని చేయించాలన్నారు. జాబ్‌కార్డుదారులతో ఆధార్ సీడింగ్ చేయాలన్నారు. రోజువారీ మస్తర్ ప్రకారం రెండుసార్లు ఎన్ఎంఎంఎస్ యాప్‌లో కూలీల ఫొటోలు అప్‌లోడ్ చేయాలని, వేసవిలో విరివిగా పనులు చేపట్టి నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేయాలని సూచించారు. ఏపీఓ జి.వెంకటరమణ, జేఈ వై.నాగలోవ, టెక్నికల్ అసిస్టెంట్లు టి.రాజేంద్ర, కె.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చి.. గడప గడపకూ..



శ్రీమహాలక్ష్మి వేసిన నవరత్నాలు, సీఎం జగన్ చిత్రాల రంగవల్లిని చూస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, నాయకులు

ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కరప: ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు అన్నీ అమలుచేశామని చెప్పడానికి, చేయాల్సినవి ప్రజలకు వివరించడానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకుంటూ ఆర్థిక ప్రగతిని సాధించాలని ఎమ్మెల్యే కన్నబాబు కోరారు. గడప, గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా బుధవారం ఆయన స్థానిక నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో కలసి కరపలోని మెరకవీధి, మెయిన్‌రోడ్డు, సూర్యారావుపేట తదితర వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. నియోజకవర్గ పరిధిలో ప్రతి ఒక్కరికీ నాలుగైదు పథకాల ద్వారా రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకూ లబ్ధిపొందిన కుటుంబాలు సంతృప్తి వ్యక్తం చేయడం గర్వంగా ఉందన్నారు. గ్రామంలో చాలా అభివృద్ధి పనులు చేపట్టామని, కొన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు కావాలని అడగారని, వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశా జ్యోతి, ఉపసర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, గ్రామకమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు ఆయన వెంట ఉన్నారు. రామాలయం వద్ద పంతాడి శ్రీమహాలక్ష్మి నవరత్న పథకాలు, మధ్యలో సీఎం జగన్ చిత్రాలతో వేసిన రంగవల్లి అందరినీ ఆకట్టుకుంది. ఎంపీడీఓ కర్రె స్వప్న, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, కార్యదర్శి వి.సునీల్ కుమార్, ఎస్‌కే నాగేంద్రకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, సర్పంచ్‌లు రొక్కాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

హైపర్ టెన్షన్‌తో అప్రమత్తం



ఉచిత వైద్య పరీక్షల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీ శ్రీనివాస్ తదితరులు

కాకినాడ రూరల్: వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా మెడికవర్ ఆస్పత్రిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా పోలీసు సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షల పోస్టర్‌ను ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, ఏఎస్పీ పి.శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఈనెలాఖరు వరకు అచ్చంపేట జంక్షన్ వద్ద మెడికవర్ ఆస్పత్రి యాజమన్యం కల్పించిన వైద్య పరీక్షల సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోలీసులను కోరారు. కన్సల్టెంట్ జనరల్ ఫిజీయస్ డాక్టర్ వీఆర్ఆర్ వసంత కుమార్ మాట్లాడుతూ అకాల మరణాలకు ప్రధాన కారణాలలో హైబీపీ ఒకటన్నారు. ప్రతి 8 మందిలో ఒకరు రక్తపోటుతో బాధపడుతున్నారన్నారు. హృదయ సంబంధి వ్యాధులకు రక్తపోటు కారణమని అందువల్ల ప్రతి ఒక్కరూ బీపీని నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. మెడికవర్ హెడ్ సిద్ధారెడ్డి, విజయ సారధి తదితరులు పాల్గొన్నారు.

పూడిక తీత పనుల పరిశీలన

కాకినాడ సిటీ: నగరంలో జరుగుతున్న పూడిక తీత పనులను ఏడీసీ సీహెచ్ నాగనరసింహరావు బుధవారం పర్యవేక్షించారు. జగన్నాథపురం వంతెన, సంతచెరువు ప్రాంతంలో పర్యటించిన ఆయన అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. తడిచెత్త, పొడి చెత్త సేకరణ, విభజించి విధానాన్ని పర్యవేక్షించారు.

బావమరిదిపై కోపంతో బైక్‌కు నిప్పు

కరప: బావమరిది తిట్టాడన్న కోపంతో మోటార్‌బైక్‌ను తగలపెట్టిన ఘటన కూరాడలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కరప మండలం కూరాడ శివారు చినమామిడాడకు చెందిన ముమ్మిడి జీవరత్నం లారీడ్రైవర్‌గా పనిచేసేవాడు. కొంతకాలం క్రితం యాక్సిడెంట్ కాగా జీవరత్నం, భార్య నాగమణితో కలసి ఇంటివద్దే ఉంటున్నాడు. బుధవారం బావమరిది సత్యనారాయణ బావవద్దకు వెళ్లాడు. మోటార్‌సైకిల్ గురించి నాది అంటే నాదని ఘర్షణపడ్డారు. కూరాడ సమీపంలోని రైల్వే గేటు వద్దకు వచ్చేసరికి జీవరత్నం తన మోటారుసైకిల్‌కు తానే నిప్పంటించాడు. దీంతో ఒక్కసారికి నిప్పులు ఎగచిమ్మడంతో రైల్వే గేటుకు అటూ ఇటూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కాకినాడ నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను అదుపుచేయడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కరప పోలీసుస్టేషన్‌కు ఫోన్‌చేసి వివరణ కోరగా ఇంతవరకూ ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

20 నుంచి మేరీ లైఫ్‌-మేరా స్వచ్ఛ షహర్

- పాత వస్తువుల సేకరణకు కేంద్రాల ఏర్పాటు
- కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల



నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ సిటీ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జూన్ 5న మేరీ లైఫ్–మేరా స్వచ్ఛ షహర్ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల తెలిపారు. ఈ నెల 20 నుంచి జూన్ 5వతేదీ వరకు రీ సైక్లింగ్ ప్రక్రియకు ఉపయోగపడే పాత పుస్తకాలు, దుస్తులు, బొమ్మలు, ప్లాస్టిక్, ఇతర వస్తువులను పెద్ద ఎత్తున సేకరించనున్నట్లు తెలిపారు. ఈ అంశంపై బుధవారం స్మార్ట్ సిటీ సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. పాత వస్తువుల సేకరణ కోసం కాకినాడ నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో 14 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉండే ప్రజలు, సంస్థలు చైతన్యవంతులై తమ వద్ద నిరుపయోగంగా ఉండి రీ సైక్లింగ్‌కు ఉపయోగపడే వస్తువులను ఆయా కేంద్రాల్లో అందజేయాలన్నారు. సేకరించిన వస్తువులను పునరుత్పత్తికి వినియోగిస్తామన్నారు. నగరంలోని బోట్‌క్లబ్ పార్కు, జన్మభూమి పార్కు, సాంబమూర్తినగర్‌లోని లైబ్రరీ బిల్డింగ్ అంబేద్కర్ పార్కు, ఎంజీ స్కూలు ఎదురుగా గల మస్టర్ కార్యాలయం, ఏటిమొగ వెహికల్ యార్డ్, జగన్నాథపురం పాత ఈ–సేవ బిల్డింగ్, ముగ్గుపేట కమ్యూనిటీ హాలు, జ్యోతుల మార్కెట్ ఈవేస్ట్ సెంటర్, పాత కార్పొరేషన్ కార్యాలయం, కొత్తపేట చిన్న మార్కెట్ వద్ద గల కమ్యూనిటీ హాల్, వార్ఫ్‌రోడ్డులోని కమ్యూనిటీ హాలు, బాలభవన్ వద్ద మస్టర్ ఆఫీస్, వివేకానంద పార్కు, శ్రీనివాస్ బ్యాంక్ కాలనీ షెడ్డు వద్ద ఈ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాత వస్తువులను సేకరించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించినట్లు కమిషనర్ తెలిపారు. ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, డీఈ మాధవి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్‌వో మానే కృష్ణమోహన్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు

కాకినాడ సిటీ: నగరంలో శుభ్రం చేస్తున్న ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో 762 ఖాళీ స్థలాలను గుర్తించామని, 122 స్థలాలను శుభ్రం చేయించామని తెలిపారు. ప్రతి ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు.

ప్రతి ఒక్కరూ నగరపాలక సంస్థ వాహనాలకు మాత్రమే చెత్తను అందజేయాలన్నారు. ఖాళీస్థలాల సమీపంలో ఉన్న ఇంటి యజమానులు నగరపాలక సంస్థకు సహకరించి నగర అభివృద్ధి, స్వచ్ఛ కాకినాడగా చేసేందుకు సహకరించాలని కమిషనర్ మహేష్‌కుమార్ కోరారు.